ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 | సంచిక : 05 | జనవరి 2010

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

తణుకు ......... 15-11-2009

అరుణాచలం. 01-12-2009

జిన్నూరు ....... 13-12-2009

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-11-2009, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పైకి అతి సామాన్యంగా కనిపిస్తూ ఉండాలి, లోపల బలం పెంచుకొంటూరావాలి. మన ఆలోచనావిధానం సక్రమంగా ఉండాలి. అర్థం చేసుకోవటంకూడా ఒక యోగం. మనకు కనిపిస్తున్న మనుషులనే మనం అర్థం చేసుకోలేము ఇంక కనిపించని దేవుడిని ఎలా అర్థం చేసుకోగలము. ఇది కలియుగం. భవిష్యత్‌లో డబ్బులేని వారు బతకవచ్చు గాని తెలివిలేనివారు బతకటం చాలా కష్టం. భవిష్యత్‌లో మోసాలు ఎక్కువగా ఉండవచ్చు. మనకు వివేకం ఉండాలి, సూక్ష్మబుద్ధి ఉండాలి, విచక్షణ ఉండాలి. మనకు ఏది మంచిది, ఏది చెడ్డది, ఏది మనకు ఉపకారం చేస్తుంది, ఏది ఉపకారం చెయ్యదు, మనం ఎవరితో స్నేహం చేయాలి, ఎవరికి దూరంగా ఉండాలి అనే విచక్షణ మనం పెంచు కొంటూరావాలి. ప్రతీమనిషికి ఎంతోకొంత సొంత ఆలోచన ఉండాలి. ఎవరైనా చెపితే మనం వినవచ్చు కాని అది ఎంతవరకు సక్రమంగా ఉంది అని సొంతంగా మనం ఆలోచించుకోవాలి. మనుషులలో చాలామంది గొర్రెలవంటివారు. ఒకరు ఏదైనా పనిచేస్తే అందరూ దానిని అనుకరణ చేస్తూ ఉంటారు. ముఖ్యంగా మనం పవిత్రమైన జీవితం, ఆత్మవిశ్వాసం ఇవి రెండూ అభివృద్ధి చేసుకోవాలి. మనకు ఆత్మవిశ్వాసం లేకపోతే అసలు నిర్ణయాలు తీసుకోలేము. కొంతమంది ఒక విషయం ఆలోచించటానికి కూడా వాయిదాలు వేస్తూ ఉంటారు, వారు బద్ధకస్తులు అని అర్థం.

ఇంట్లోవారికైనా, బయటివారి కైనా మనం ఎప్పడూ మంచి చెప్పాలి. వారు వినకపోతే మనం ఏమి చేయగలము. ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి వినాలనిపించదు, ప్రారబ్ధం యొక్క వేగం అలాగ ఉంటుంది.

ఒకోసారి ఎవరైనా మనకు మంచి చెప్పినా మన ప్రారబ్దం అనుకూలంగా లేకపోతే అది వినాలనిపించదు. రెండోరోజున యుద్ధానికి వెళుతూ ఉంటే వాలితో తార ఏమని చెప్పింది అంటే ఈ రోజున నువ్వు యుద్ధానికి వెళ్ళవద్దు. మనకు సొంత ఆలోచన ఉండాలి. నిన్న ఓడిపోయి వెళ్ళిపోయిన వాడు మరల ఈ రోజున యుద్ధానికి వచ్చాడు అంటే వాడికి ఏదో అండ దొరికింది, మనకు కనబడని శక్తి ఏదో వాడి వెనకాల ఉంది. సుగ్రీవుడికి రాముడితో స్నేహం కుదిరింది అని నేను విన్నాను. రాముడు సామాన్యమానవుడిగా నీకు కనిపిస్తూ ఉన్నా ఆయన అతి బలవంతుడు, రాముడు ఎత్తిన బాణం దింపకుండా 14వేల మంది రాక్షసులను ఒక్కరోజులో చంపాడట, అంటే వాడు ఎంత బలవంతుడో ఆలోచించుకో అని తార చెప్పింది. వాలి ఏమన్నాడు అంటే నువ్వు చెప్పిన మాటలు అబద్దాలు అని నేను చెప్పటం లేదు. ఎవడైనా వచ్చి యుద్ధానికి పిలిస్తే నేను ఇంట్లో కూర్చోలేను. నేను చనిపోయినా పరవాలేదు యుద్ధం చేసితీరతాను అని చెప్పాడు. ఆ ప్రారబ్దం యొక్క వేగాన్ని మీరు అర్థం చేసుకోండి. మనుషులను అంచనా వేసేటప్పుడు చాలా తెలివిగా ఉండాలి. పైకి వారు ఎలా కనిపిస్తున్నా లోపల ఎంత బలంగా ఉన్నారో అది చూడాలి. ఇక్కడ మనం నేర్చుకొనేది ఏమిటి అంటే పైకి రాముడిలాగ కామన్‌గా ఉండాలి, లోపల బలం పెంచుకొంటూ ఉండాలి.

వారి ప్రారబ్దం అలా ఉంది, వీరి ప్రారబ్దం ఇలా ఉంది అని అంటారు. దేహ ప్రారబ్దాన్ని జయించటం చాలా కష్టం. రాముడి పట్టాభిషేకానికి ముహూర్తం పెట్టారు కాని అదే ముహూర్తానికి రాముడు అరణ్యానికి వెళ్ళవలసి వచ్చింది, అది ఆయన ప్రారబ్దం. కేవలం వాడి నక్షత్రాన్ని బట్టి ఒక మనిషి యొక్క జాతకాన్ని మనం చెప్పలేము. రాముడు పునర్వసు నక్షత్రంలో పుట్టాడు. అలాగని పునర్వసు నక్షత్రంలో పుట్టినవారు అందరూ రాముడంతటివారు అవుతారని ఎక్కడా లేదు. నేను అరణ్యానికి వెళుతున్నాను అని రాముడు కౌశల్యతో చెపితే నేను కూడా వస్తాను అని కౌశల్య అంటుంది. అమ్మా నా దేహప్రారబ్దంలో అరణ్యవాసానికి వెళ్ళవలసి ఉంది, ఆ ప్రారబ్దం ప్రకారం నేను వెళుతున్నాను. నువ్వు నీ భర్తకు సేవ చెయ్యాలి, నాకూడా రావటం తగదు అని తల్లికి నచ్చచెపుతాడు. భగవంతుడు సర్వజ్ఞుడు. ప్రారబ్దాన్ని బట్టి ఆ జీవుడిని ఎలా నడిపించాలి అనేది భగవంతుడు చూసుకొంటాడు, ఆయన శక్తిమంతుడు, ఆయన ఆజ్ఞను మనం ఉల్లంఘించలేము. ప్రారబ్దాన్ని మనం జయించలేము ఎందుచేతనంటే అది ముందు మనకు తెలియదు, జరిగిపోయిన తరువాత మన ప్రారబ్దం ఇలా ఉంది అని మనకు తెలుస్తుంది, అప్పుడు ఏమి చేయగలము. మన ఇంట్లో వారు కూడా ఒకోసారి మనలను ప్రేమగా చూస్తారు, ఒకోసారి వదిలేస్తారు. భార్యాభర్తల ప్రేమలు కూడా అంతే. ఎప్పుడైనా కోపాలు వస్తే

దూరమైపోతారు. ఇవన్నీ వ్యక్తి భావనతో కూడిన ప్రేమలు. అక్కడ నీ భర్త కంటే నీ వ్యక్తిభావన ముఖ్యం. అలాగే నీ భర్తకు కూడా నీకంటే వాడి వ్యక్తిభావనే ముఖ్యం. వ్యక్తిభావనను మనిషి అలా కాపాడుకొంటూ ఉంటాడు. భగవాన్ ఏమన్నారు అంటే దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు, ఆ ప్రారబ్దం యొక్క ప్రభావం నీ మీద పడకుండా చూసుకో. దేహప్రారబ్దాన్ని బట్టి అదృష్టం ఎదురైనా, దురదృష్టం ఎదురైనా అవి ఏమీ నిజం కాదు. ప్రారబ్దంప్రకారం అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఆచార్యులవారు ఏమన్నారు అంటే కక్కినకూడు వంక ఎవడైనా చూస్తాడా అలాగే నీకు దేహంతో తాదాత్మ్యం పోతే, దేహము నేను అనే బుద్ధి కనుక పోతే ఇంక ఆ దేహము మీదకు నీ మనస్సు వెళుతుందా అంటే వెళ్లదు ఎందుచేతనంటే అది కక్కినకూడులాంటిది.

మన హృదయంలో ఒక సత్యం ఉంది. మనం సత్యానుభవం పొందాలి. అంతవరకు మనకు అదృష్టం తప్పదు, దురదృష్టం తప్పదు, చావులు తప్పవు, పుట్టుకలు తప్పవు, సంసారం తప్పదు, ఈ మొట్టికాయలు తప్పవు. సత్యసాక్షాత్కారం పొందటంపైనే నీ సాధన అంతా గురిపెట్టు మిగతా గొడవలలోనికి వెళ్లవద్దు. నీ కాలాన్ని మూడు భాగాలుగా విభజించుకో. 1. నీ సంసారానికి సంబంధించిన పనులు ఏమైనా ఉంటే చూసుకో. వాటికోసం ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. అందుచేత ఇంటి దగ్గర పనులు మనం చేసుకోవాలి. 2. నీకు ఏదైనా చేతనైతే సమాజానికి సహకరించు. నువ్వు ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే అదంతా నీకే తిరిగి వస్తుంది. అది నీకు తెలియక వారికి ఉపకారం చేసాను, వీరికి ఉపకారం చేసాను అంటావు. అందుచేత మీకు అవకాశం ఉంటే సమాజానికి ఏదైనా ఉపయోపడవచ్చు. సమాజానికి ఉపయోగపడటం వలన నువ్వు పవిత్రుడవు అవుతావు. నువ్వు లోకానికి ఏదైనా చేస్తే అది నేను చేసాను, ఇది నేను చేసాను అని అనుకోకు, చేసి మర్చిపో. మర్చిపోవటం అనేది మంచి మందు. 3. మిగతాకాలాన్ని అంతా కూడా ఆత్మజ్ఞాన సముపార్జనకు ఉపయోగించుకో, చిల్లరగొడవలలోనికి వెళ్లవద్దు, చిల్లరచింతలు వద్దు. గమ్యాన్ని విడిచి పెట్టవద్దు. రాత్రి మనకు విమానాల మీద తిరిగినట్లు, చాలా భోగాలు అనుభవించినట్లు స్వప్నం వస్తుంది. కాని మెలకువ వచ్చాక అది అంతా అబద్ధం అని తెలిసిపోతుంది. అది అబద్ధం అని తెలిసాక ఆ విమానాలు గుర్తుకురావు, ఆ ఐశ్వర్యం గుర్తుకు రాదు. అలాగే ఈ జాగ్రదవస్థలో నువ్వు అనుభవించే భోగాలు, సుఖాలు ఇవన్నీ కూడా నీ హృదయంలో ఉన్న చైతన్యంలో మేల్కొన్నాక ఇది అంతా అసత్యం అని స్పష్టంగా నీకు గోచరిస్తుంది. ఎప్పుడోకాదు ఈ శరీరం ఉండగానే అది అసత్యం అని మనకు అర్థమైతే మన

మనస్సు ఇంక వాటిమీద వాలమన్నా వాలదు.

కామం వేరు, ప్రేమ వేరు, మీకు కామం ప్రేమకింద కనిపిస్తోంది. కామం ఒక రూపానికి, నామానికి పరిమితమై ఉంటుంది. ప్రేమ ఒక రూపానికి, నామానికి పరిమితమై ఉండదు. కామానికి ప్రేమకు తేడా మీకు తెలియటం లేదు. కామం అడుగుతుంది, ప్రేమ ఏమీ అడగదు. కామం వ్యాపారం చేస్తుంది. ప్రేమ వ్యాపారం చెయ్యదు. ప్రేమ అంటే అది మీరు అనుకొన్నంత తేలిక కాదు. ఒక్క ఆత్మజ్ఞానికి తప్పించి ప్రేమించటం ఎవడికీ సాధ్యం కాదు. నువ్వు భగవంతుడికి వేరుగా లేవు కాని వేరుగా ఉన్నాను అనుకొంటున్నావు అది రాంగ్ తింకింగ్. మిగతా విషయాలు తరువాత చూద్దాము ముందు నా ఆలోచనలో ఉన్న పొరపాట్లను దహనం చెయ్యి. వంకరగా ఆలోచించకుండా సక్రమంగా ఆలోచించే శక్తిని, సక్రమంగా అర్థం చేసుకొనే శక్తిని ప్రసాదించు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. భగవాన్ ఏమంటున్నారు అంటే దేహము నేను అనే తలంపు ఉంటే నీకు ప్రారబ్దం కాని దేహము నేను అనే తలంపు లేనప్పుడు గాఢనిద్రలో ప్రారబ్దం ఎక్కడ ఉంది. దేహము నేను అనే తలంపు నీకు వచ్చినప్పడే నేను ప్రారబ్దం అనుభవిస్తున్నాను అనిపిస్తుంది కాని లేకపోతే నేను ప్రారబ్దం అనుభవిస్తున్నాను అనే తలంపు నీకు రాదు. ఫలానా కారణం వలన మాకు దుఃఖం వస్తోంది అంటారు అది నూటికి నూరుపాళ్ళు అబద్దం అన్నారు భగవాన్. మీరు అనుకొనేవి అన్నీ అబద్దాలు. మీకు నిజం తెలిసేవరకూ నిజం కానిదానిని నిజం అని అనుకొంటూనే ఉంటారు. దుఃఖ కారణం అసలు బయట లేనేలేదు. నీకు వచ్చిన కష్టమే జ్ఞానికి వచ్చింది అనుకో వాడికి ఏమీ అనిపించటంలేదు. నీవు చెప్పిన బయట కారణం నిజమైతే వాడికి ఎందుకు దుఃఖం రావటం లేదు. అంటే దుఃఖకారణం బయట లేదు. అది లోపల అహంభావన రూపంలో ఉంది. బయట సంఘటనలకు దుఃఖానికీ ఏమీ సంబంధం లేదు. పరమాత్మ కంటే నేను భిన్నంగా ఉన్నాను అనే వేరుభావన పోతే అసలు నీకు దుఃఖం కనిపించదు.

భగవాన్ ఏమంటున్నారు అంటే ఈ శరీరం పుట్టినరోజున మీరందరు పుట్టినరోజులు చేసుకొంటున్నారు. ఈ శరీరం వచ్చిన మూలాన మనకు సంసారం వచ్చింది. సంసారం మీకు సరదాగా ఉందా. ఈ శరీరం వలన సంసారం వస్తోంది, సంసారం వలన అరిష్టాలు వస్తున్నాయి, చావులు పుట్టుకలు వస్తున్నాయి. కనీసం శరీరం పుట్టినరోజున అయినా అయ్యో మనం మాయలో పడ్డాము, ఈ మాయను జయించటం కష్టం, ఈ మాయలో నుండి ఎలా బయటకు రావాలి అని విచారణ చేయటం మానేసి సినిమాలకు తిరగటం, రోడ్లమీద తిరగటం, మెడలో దండలు వేసుకోవటం, పాయసాలు తాగటం, డిన్నర్లు చేయటం. అసలు మీకు

విచారణ ఏమైనా ఉందా. 365 రోజులు విచారణ చేయకపోయినా కనీసం శరీరం పుట్టిన రోజున అయినా విచారణ చేయాలి కదా. మీరు దేహాభిమానాన్ని ఆ రోజుకారోజు తగ్గించుకోవాలి, దాని మీదే సాధన గురిపెట్టాలి. ఈ లోకంలో కొందరు మిమ్మల్ని తిడుతూ ఉంటారు, కొందరు పొగుడుతూ ఉంటారు. మీకు పదవులు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మీకు ఐశ్వర్యం వస్తూ ఉంటుంది, పోతూ ఉంటుంది. ఇక్కడ ఎక్కడ మీరు చిక్కవద్దు, పట్టుబడవద్దు. ఈ లోకం యొక్క గొడవలలో మీరు బంధింపబడవద్దు. మీరు వచ్చిన పని చూసుకోండి. వాడు నన్ను కొట్టాడు, వీడు నన్ను తిట్టాడు అనే చిల్లర గొడవలలోనికి వెళ్లకుండా మీరు సాధన చేసి దేహబుద్ధిని పోగొట్టుకొని ఆత్మబుద్ధిని సంపాదించుకోండి. ఆత్మబుద్ధి పొందేవరకూ ఎవరూ నిన్ను రక్షించలేరు. నీ శరీరం శవం అయినప్పుడు నిన్ను రక్షించటానికి నీ భర్త వస్తాడా, నువ్వు సంపాదించిన ఆస్తి వస్తుందా లేకపోతే ఈ లోకంలో నువ్వు సంపాదించిన గౌరవం వస్తుందా. ఏది వస్తుంది నిన్ను రక్షించటానికి, ఎవ్వరూ నిన్ను రక్షించలేరు. అందుచేత ఈ లోకం గొడవలు వదిలేసి నిన్ను నువ్వు బాగుచేసుకోవటానికి నీ కాలాన్ని పూర్తిగా ఉపయోగించుకో. నీకు దేహబుద్ధి పోయింది అనుకో ప్రారబ్దం నిన్ను ముట్టుకోదు. జ్ఞాని ఏమి చేస్తాడు అంటే వైరాగ్యం అనే పెద్ద కత్తి పట్టుకొని లోపల ఎవడైతే అశాంతికి గురి అవుతున్నాడో వాడిని నరికేస్తాడు.

ఈశ్వరసంకల్పం బలీయమైనది, దానిని మనం అతిక్రమించలేము. యుద్ధం చెయ్యమని చెప్పాడు అని కృష్ణుడిని కొంతమంది ఆక్షేపిస్తారు. అర్జునుడు యుద్ధం చెయ్యకపోతే అసలు దేశాన్ని ఎవడు రక్షిస్తాడు. భారతదేశంలో పుట్టిన గొప్ప వీరులలో అర్జునుడు ఒకడు. వాడి ప్రారబ్దాన్ని బట్టి వాడు యుద్ధం చేయాలి అంతేగాని మనలాగ కూర్చుంటే ఎలాగ. కృష్ణుడు యుద్ధం చెయ్యమన్నాడు అంటే ఆయన హింసాప్రియుడు అని కాదు. అక్కడ అవసరం ఉంది కాబట్టి చెయ్యమని చెప్పాడు. మనకు చేతిమీద కురుపు వేస్తే ఆ కురుపును కోసేస్తాము. ఆ కురుపు మీద మనకు కోపం కాదు, శరీరం ఆరోగ్యం కాపాడుకోవటంకోసం అలా చేస్తాము. అలాగే సమాజం శాంతిగా ఉండాలంటే కొంతమందిని బయటకు పంపించేయాలి. యుద్ధం అంటేనే క్రూరకర్మ కాని అది తప్పదు. అర్జునుడిని చంపటానికి కర్ణుడు శక్తివంతమైన ఆయుధాలు సంపాదించుకొన్నాడు. కాని ఈశ్వర నిర్ణయం ఎలా ఉంది అంటే ఆ శక్తివంతమైన ఆయుధాలను తప్పనిసరి పరిస్థితులలో ఘటోత్కచుడి మీద ఉపయోగించవలసి వచ్చింది. అప్పుడు కర్ణుడు అనుకున్నది ఏమైంది. ఈశ్వరనిర్ణయమే జరుగుతుంది. దేవుడు అంటే ఏమిటో ఇప్పుడు మీకు తెలుస్తోందా. మనం జాగ్రదవస్థలోనికి వచ్చాము అంటే మంచి విషయాలు మాట్లాడాలి, మంచి విషయాలు శ్రవణం చేయాలి, మంచి పనులు చేయాలి.

కాని మనం సాధన చేసుకోవటానికి, మంచి పనులు చేయటానికి జాగ్రదవస్థలోనికి రావటం లేదు. ఎవరో ఒకరి కొంపలు తగలబెట్టటానికి, సాపాటు చేయటానికి వస్తున్నాము. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే నీకు చెవులు ఉన్నాయి అనుకో, చెవులతో మంచి విషయాలు శ్రవణం చేయకపోతే ఆ చెవులు ఏమి చేసుకొంటావు అన్నారు. మనం మంచి విషయాలు శ్రవణం చేయాలి. మంచి విషయాలను శ్రవణం చేయటం వలన వివేకం పెరుగుతుంది, బుద్ధిబలం పెరుగుతుంది. మీరు అశాంతిగా ఉన్నారు అనుకోండి, దుఃఖంగా ఉన్నారు అనుకోండి పరమాత్మ మీలోపలే ఉన్నా కూడా ఆయన ఎక్కడో ఉన్నాడు, ఆయనను మనం గ్రహించలేము, ఆయనను తెలుసుకోలేము అని మనకు అనిపిస్తుంది. మనం శాంతిగా ఉంటే, సుఖంగా ఉంటే పరమాత్మ మనకు దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తుంది. మీ జీవితంలో అనేక సంఘటనలు ఎదురవుతూ ఉంటాయి. మీకు సంతోషాలు వస్తాయి, దుఃఖాలు వస్తాయి, అవన్నీ తప్పించుకోండి. మీరు గమ్యాన్ని విడిచిపెట్టవద్దు. ఎప్పడూ గమ్యం మనకు గుర్తులో ఉండాలి.

భగవాన్ ఏమి చెప్పారు అంటే నువ్వు ఎన్ని శాస్త్రాలు చదువు, ఎంతమంది గురువుల దగ్గరకు వెళ్ళు, ఎన్ని నదులలో మునుగు, ఎన్ని రకాల సాధనలు చెయ్యి, నువ్వు ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం సాధించటం కంటే మించిన పని లేదు. నీకు ఇంద్రియనిగ్రహం లేనప్పడు, మనోనిగ్రహం లేనప్పడు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా నీకు శాంతి లేదు, సుఖం లేదు. నీ మనస్సును, ఇంద్రియాలను అదుపులో పెట్టుకో. దానికి ఆహారనియమం అవసరం. మనం తినే తిండి దగ్గర జాగ్రత్తగా లేకపోతే సాధన చేసినా అది ఫలించదు. మాట దగ్గర జాగ్రత్తగా ఉండాలి. అతి నిద్ర పనికిరాదు. అతిగా వ్యవహారం పనికిరాదు, స్నేహాలు ఎక్కువగా చేయవద్దు. ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకోవద్దు. ఇద్దరు ఉంటే ఒకరిమీద ఇష్టం, ఒకరి మీద అయిష్టం. ఉన్నది ఒక్కటే అయితే ఎవరిని చూసి ఇష్టపడతావు, ఎవరిని చూసి అయిష్టపడతావు అంటున్నారు భగవాన్. జీవాత్మ పరమాత్మలో ఐక్యమవ్వటమే యోగం అని చెపుతారు. ఒక వస్తువునుగాని, ఒక మనిషినిగాని ఉన్నది ఉన్నట్లుగా చూడగలగటం యోగం. జ్ఞాని ఈ సృష్టిని ఉన్నది ఉన్నట్లుగానే చూస్తాడు, వాడికి ఇది కల్పితం అని తెలుస్తూ ఉంటుంది. కల్పితంలో కూడా ఆ కల్పితానికి ఆధారంగా ఉన్న వస్తువునే చూస్తూఉంటాడు. అహల్య దేహం దేవాలయం అయిపోయింది. అక్కడ శరీరం గౌతముడి భార్యే కాని లోపల అహల్య లేదు. రాముడి పాద స్పర్శ వలన వీడు నా భర్త అనుకొనే అహల్య చనిపోయింది. అంటే అహల్య బ్రహ్మం అయిపోయింది. అహల్య గౌతముడి వంక చూస్తోంది. గౌతముడు అహల్య వంక చూస్తున్నాడు. సర్వసాధారణంగా భార్యాభర్తలు కామంతో చూసుకొంటారు కదా. అహల్య కళ్ళలో కామం

కనబడటం లేదు అది గౌతముడు గ్రహించాడు. ఆ కళ్ళ నిండా శాంతి, ఆనందం, అది భౌతికమైనది కాదు, ఆ కళ్ళనిండా జ్ఞానమే అంటాడు గౌతముడు. మీరు ప్రశాంతంగా ఉన్నప్పుడు భగవాన్ కళ్ళలోనికి పదినిమిషాలు చూడండి, మీ పని పూర్తి అయిపోతుంది. మీరు రోడ్డు మీద పడి దొర్లనక్కరలేదు, పెద్దపెద్ద పుస్తకాలు చదవనక్కరలేదు. భగవాన్ ఫొటోను మీకు బాగా కనిపించేలా పెట్టుకొని మీరు ఎంతసేపు చూడగలిగితే అంతసేపు ఆయన కళ్ళలోకి చూడండి. అలా చూస్తే సరిపోతుంది అదే పెద్ద సాధన.

భగవంతుడు మీ హృదయంలోనే ఉన్నాడు. మీరు అక్కడకు చేరుకోవాలి. మనం మంచి పనులు చేయాలి, సంఘాన్ని ఉద్ధరించాలి అనే మంచి భావాలు నీకు ఉండవచ్చు కాని హృదయంలోనికి ప్రయాణం చేయటానికి నీవు ప్రయత్నం చేసేటప్పుడు దీనితోపాటు చేయవలసిన మంచిపనులు చాలా ఉన్నాయి అని మీరు అనుకొంటే హృదయం యొక్క లోతులలోనికి మీరు వెళ్ళలేరు. మనం హృదయంలోనికి వెళ్ళాలి, అది ఒక్కటే నిజం, అదే మన జీవితగమ్యం అనుకుంటే తప్ప మీరు అక్కడకు చేరుకోలేరు ఈ లోపుగా మీకు ఏది జ్ఞాపకం వచ్చినా ఆ లోతులలోనికి మీరు ప్రవేశించలేరు. జ్ఞానమార్గం ఎక్కడికి తీసుకొని వెళుతుందో కర్మమార్గం కూడా అక్కడికే తీసుకొని వెళుతుంది. సత్కర్మ నిష్కామంగా ఎందుకు చెయ్యమన్నారు అంటే దానివలన మనం పవిత్రం అవుతాము, హృదయం శుద్ధి అవుతుంది. హృదయం శుద్ధి అయితే నువ్వు శ్రవణం చేసింది అక్కడ నిలబడుతుంది. అయితే ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం మనకు బలీయంగా ఉండాలి. సాధ్యమైనంతవరకు దైనందిన జీవితంలో వ్యక్తిభావన లేకుండా జీవించాలి. షేక్స్పియర్ ఏమన్నాడు అంటే మీకు దుఃఖం వస్తూ ఉంటే, అశాంతి వస్తూ ఉంటే కంగారుపడకండి. మీ దుఃఖం యొక్క అంతంలో సుఖం ఉంది, అశాంతి యొక్క అంతములో శాంతి ఉంది. తాత్కాలికముగా నీకు దుఃఖం ఉండవచ్చు. పరిణామంలో చివరిలో సుఖం ఉంది. అది దృష్టిలో పెట్టుకొని దీనిని భరించండి. అందుచేత ఇప్పడు మీకు దుఃఖం వచ్చిందని కంగారుపడవద్దు. ఆగ్రహం పనికిరాదు నిగ్రహంగా ఉండాలి. కొంతమంది కోపదారులు ఉంటారు. ఓ వాలీ నువ్వు గొప్ప వీరుడివే కాని నీకు కోపం ఎక్కువ. నీకు తెలివితేటలు ఉన్నా నీ కోపమనే గాలి వచ్చి నీ వివేకాన్ని ఎగరిగొట్టి పడేస్తోంది. నీ కోపం నిన్ను స్థిమితంగా ఉండనివ్వటం లేదు అని తార చెపుతుంది. వాల్మీకి వ్రాసిన ఈ మాటలు మీకు ఎవరు చెపుతారు. మన కుటుంబ సభ్యులు ఎవరైనా చెప్పగలరా.

వాలి రాముడితో ఏమంటాడు అంటే నన్ను చెట్టు ప్రక్కనుండి చంపావు, నా ఎదురుగా వస్తే నిన్ను ఈపాటికి యమలోకానికి పంపేవాడిని అంటాడు. అప్పుడు రాముడు ఏమన్నాడు

అంటే వాలీ నువ్వు కొన్నిపొరపాట్లు, పాపాలు చేసావు. ఆ పొరపాట్లుగాని, పాపాలుగాని ఇంక నిన్ను పీడించవు, అవి నిన్ను వెంటాడవు ఎందుచేతనంటే నీవు నా చేతిలో మరణిస్తున్నావు. అది గ్రహించటం మానేసి నన్ను తిడుతున్నావు అంటాడు రాముడు. సర్వసాధారణంగా మనిషి ఏదైనా దోషం చేస్తే దానికి సమాధానం చెప్పేవరకు వందజన్మలు అయినా అది నిన్ను వెంటాడుతుంది, చేసావా నీవు అనుభవించవలసిందే. ఇక్కడ రాముడు ఏమంటున్నాడు అంటే నీ విషయంలో అది లేదు ఎందుచేతనంటే నువ్వు నా చేతిలో మరణిస్తున్నావు, ఇంక వెంటాడటమనేది ఏదీ లేదు. ఇక్కడ ఒకటి గుర్తు పెట్టుకోండి. వాలి నా శత్రువు అనే తలంపు అక్కడ లేదు, అది చెయ్యవలసింది కాబట్టి చేసాడు కాని శత్రుత్వం అక్కడ లేదు. పిల్లలు లేనివారు ఎందుకు అదృష్టవంతులు అంటే మాకు పిల్లలు లేరు అని వారు అనుకొంటారు అంతే. వ్యర్థులైన సంతానం వలన తల్లితండ్రులు జీవితం పొడుగునా కాలిపోతూ ఉంటారు. వారిని విడిచిపెట్టలేరు, వారు పాడైపోయినా వారిని చూడాలనిపిస్తూ ఉంటుంది. ఎందుచేత నంటే మమకారం ఉంటుంది కదా. ఇటువంటి సంతానంకంటే అసలు సంతానం లేనివారు అదృష్టవంతులు. జీవితం అంటే అలవాట్ల యొక్క సమూహం, తలంపుల యొక్క సమూహం, వాసనల యొక్క సమూహమే జీవితం. అంతకంటే జీవితం అంటూ ఏమీ లేదు. హృదయంలో సత్యవస్తువు ఉంది, ఆత్మ ఉంది అని చెపుతున్నారు అది నాకు చూపించగలరా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నీ సంస్కారాలలో నుండి, అలవాట్లలో నుండి బయటకురా ఆ వస్తువు ఉందో లేదో నీకే తెలుస్తుంది. అది అనుభవైకవేద్యం. ఎప్పుడోకాదు, ఎక్కడోకాదు ఇప్పుడే ఇక్కడే ఆ సమస్య పరిష్కారం అయిపోతుంది. ముందు నువ్వు నీ వాసనలలోనుండి, తలంపులలోనుండి బయటకు రా అన్నారు భగవాన్. ఇక్కడ దేవుడు లేడు, ఎక్కడో వైకుంఠంలో ఉన్నాడు అనుకొంటే ఇవి అన్నీ అహంకారం యొక్క పిచ్చి చేష్టలు అన్నారు భగవాన్. ఇవి ఏమీ నిజంకాదు అటువంటి తలంపులు నీకు వస్తూ ఉంటే మీకు అహంకారం బలిసి ఉంది అని అర్థం. సత్యం అనేది దేశకాలాలకు పరిమితమై ఉండదు. అది అంతటా వ్యాపించి ఉంది, మన హృదయంలోనూ ఉంది.

ఎవరైనా బట్టలు పెడితే అవి కట్టుకొంటే ఆరు నెలలకో, సంవత్సరానికో పోతాయి. ఎవరైనా అన్నం పెడితే ఇవాళ తింటే మరల రేపటికి మామూలుగానే ఆకలి వేస్తుంది. ఒక్క జ్ఞానం మాత్రమే శాశ్వతంగా ఉంటుంది. జ్ఞానాన్ని దానం చేసినవాడే నిజమైన దాత. జ్ఞానం వలన మాత్రమే మనకు శాంతి కలుగుతుంది, సుఖం కలుగుతుంది. జ్ఞానానికి మించిన వస్తువుగాని, జ్ఞానంతో సమానమైన వస్తువుగాని ఈ లోకంలోగాని, పరలోకంలోగాని లేదు. బయట

వ్యక్తులతోటిగాని, బయట వస్తువులతోటిగాని అనుబంధం ఉన్నవాడికి స్వతంత్రమైన సుఖం తెలియదు. వైరాగ్యం అవలంభించి విషయవాసనలలోనుండి ఎవడైతే బయటపడ్డాడో వాడికి మాత్రమే ఆత్మసుఖం అందుతుంది. మీకు ఎవరికైనా సంపదలు ఉంటే వాటిని భోగాలకు ఉపయోగించవద్దు, వాటిని యోగానికి ఉపయోగించండి. పైన కిరసనాయిలు పోసి నిప్పని ఆర్పటం ఎటువంటిదో కోరికలను నెరవేర్చుకొంటూ కోరికలను జయించటం కూడా అటువంటిదే. మీకు సినిమాకు వెళ్లాలనే తలంపు వచ్చింది అనుకోండి సినిమాకు వెళ్లి సినిమా చూసిన ఆనందం కంటే ఆ తలంపును నిగ్రహించుకోవటం వలననే ఎక్కువ ఆనందం, శాంతి మీకు వస్తుంది. బయట ఎక్కడైనా మురికిగుంటలు ఉంటే ఆ వాసన రాకూడదు అని ముక్కు మూసేసుకుంటారు. మరీ నీ లోపల ఉన్న మురికి గుంటల మాట ఏమిటి? అందులో నుండి బయటకు రావా. లోపల ఉన్న మురికి గుంటల నుండి బయటకు రావటం కష్టం, వాటిలో నుండి బయటకు రావాలంటే సాధనా బలం ఉండాలి, కాలం కలిసిరావాలి, గురువు అనుగ్రహం ఉండాలి. ఇవన్నీ కలిసివస్తే గాని లోపల ఉన్న మురికి గుంటలనుండి బయట పడలేము.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-12-2009, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు అరుణాచల దీపోత్సవం. పరమేశ్వరుడు బ్రహ్మవిష్ణువులకు జ్యోతిరూపంలో దర్శనమిచ్చిన రోజు. దానికి గుర్తుగా ప్రతీ సంవత్సరం ఇక్కడ జ్యోతి ప్రజ్వలన చేస్తారు. జ్యోతిని దర్శించినవారికి పుణ్యప్రదమని, జీవుడికి వికాసము కలుగుతుందని స్కాందపురాణములో చెప్పారు. ఈ గిరి జ్ఞానాన్ని ప్రసాదించే కొండ. అన్నామలై అంటే అందని కొండ. పరమేశ్వరుడు జ్యోతిరూపంగా వెలిసినప్పుడు బ్రహ్మవిష్ణువులు ఆయన ఆది అంతము తెలుసుకొనుటకు అహంకారముతో బయలుదేరారు కాబట్టి ఇద్దరికి అది అందలేదు. అందుచేత అహంకారము తోటి పరమేశ్వరుడిని కొలవలేము. మనస్సు ఉన్నవాడు మనస్సులేనివాడిని అర్థం చేసుకోలేడు. రాముడికి వసిష్ఠుడు గురువు, కృష్ణుడికి సాందీపులవారు గురువు, పరశురాముడికి దత్తాత్రేయుడు గురువు కాని రమణుడికి గురువు ఎవరూ లేరు. భగవాన్‌కి మరణానుభవం ద్వారా అరుణాచలేశ్వరుడు ఆయన హృదయంలో చైతన్యంగా వ్యక్తమయ్యాడు అప్పుడు భగవాన్‌కి గురువు అరుణాచలేశ్వరుడు. నమఃశ్శివాయ దీనిని పంచాక్షరీ అంటారు. అరుణాచలం దీనిని జ్ఞానపంచాక్షరీ అంటారు. అందుచేత అరుణాచలా అనుకున్నా సరిపోతుంది. ఎక్కడైతే దుఃఖ స్పర్శలేదో, ఎక్కడైతే అశాంతిలేదో, ఎక్కడైతే ద్వైతం లేదో, ఎక్కడైతే ఇష్టాయిష్టాలు లేవో ఆ స్థితికి

అంటే మహాచైతన్యంలోనికి జీవకోటిని మేల్కొలపటానికి వచ్చిన అవతారపురుషులు రమణుడు, బుద్ధుడు, రామకృష్ణుడు. నిజమైన అరుణాచలం మన హృదయంలో ఉంది, మనం అక్కడకు వెళ్ళాలి అనేవారు భగవాన్. జగత్తు, జీవుడు, దేవుడు మనో కల్పితమని చెప్పారు. నువ్వు సాధన చేసి రాగము, భయము, కోపము ఈ మూడింటిలోంచి విడుదల పొందు అర్జునా అని పరమాత్మ చెప్పాడు. ఈ మూడు ఎక్కడ ఉన్నాయో అక్కడ మనిషి కూడా నీడ వచ్చినట్లు అశాంతి వస్తుంది, కోపం వస్తుంది, భయం వస్తుంది ఇది తప్పదు.

కాశీలో మరణిస్తే ముక్తి, తిరువాయూరులో జన్మిస్తే ముక్తి, చిదంబరాన్ని దర్శిస్తే ముక్తి, అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి. వీటిలో తేలికైనది అరుణాచల స్మరణ. మన దేహం ఎక్కడ ఉన్నా అరుణాచలాన్ని స్మరించటం వలన పవిత్రులవుతాము. ఎవరైతే నిరంతరము అరుణాచలాన్ని స్మరిస్తున్నారో వారికి ఇంద్రియాలు నిర్మలమవుతాయి, మనస్సు నిశ్చలమవుతుంది. అప్పుడు వారి మనస్సు, ఇంద్రియాలు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తాయి. హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తే అక్కడ ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వస్తుంది. మనకి అరుణగిరి గుర్తుకు వస్తూ ఉంటే శాంతి వస్తుంది. మనకి ఇల్లు గుర్తుకు వస్తే మోహం వస్తుంది. పాములు మనుషుల మధ్య తిరగవు, ఎక్కడైతే మరుగు ఉంటుందో అక్కడే పాములు ఉంటాయి. అలాగే వైరాగ్యం ఉన్నవాడు విషయాల మధ్యలో ఉండకూడదు అని ఆచార్యులవారు చెప్పారు. వైరాగ్యం ఉన్నవాడు మనుషులతోటి ఎక్కువ సంబంధం పెట్టుకోవటం వలన లోకవాసన, దేహవాసన పెరిగిపోతుంది. ఈ వాసనలు మళ్ళీ మనస్సుని అంతర్ముఖం అవ్వనివ్వవు. అభ్యాసం వల్ల, వైరాగ్యం వల్ల మనస్సును లోపలకు పంపించి అన్వేషణ చెయ్యక పోతే, మనస్సు నిర్మలం అవ్వకపోతే కోటి జన్మలు ఎత్తినా మనకి ఆత్మజ్ఞానం కలుగదు. ఇది సిద్ధాతం. మనం బయటకు ఎంతదూరం అయినా వెళ్ళిపోతాము. కాని మనస్సుకి అంతర్దృష్టి కలగజేసి హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యటం, ఒక్క అంగుళం లోపలకు దిగటం చాలా కష్టంగా ఉంది. అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా, స్వాధ్యాయనం లేకుండా, సత్పురుషుల సహవాసం లేకుండా, దేవతల అనుగ్రహం లేకుండా, గురువు దయ లేకుండా ఒక్క అంగుళం కూడా మీరు లోపలకు దిగలేరు. మీరు గంటల తరబడి ధ్యానంచేసి ఒక అంగుళం లోపలకు వెళ్ళండి. అప్పుడు అంతర్ముఖంగా ప్రయాణం చేయటం ఎంత కష్టమో మీకు అర్థమవుతుంది. మోసేవాడికి బరువు తెలుస్తుంది కాని మోయనివాడికి బరువు ఎలా తెలుస్తుంది. మీరు ఎప్పుడైనా సాధనలు చేస్తూ ఉంటే అందులో మెలకువలు తెలుస్తాయి. అందుకే భగవాన్ అన్నారు అందరూ గజఈతగాళ్ళే కాని ఎవరూ గజం కూడా కదలటంలేదు అన్నారు.

నీకు ఎంతవరకూ అవకాశం ఉందో అంతవరకు ధర్మాన్ని ఆచరించు. ధర్మాన్ని ఆచరించే

విషయంలో అజాగ్రత్త పనికిరాదు. ఆచార్యులను సేవించు. నీ తల్లిదండ్రులు మంచివారా, చెడ్డవారా అనేది నీకనవసరం. ఈశ్వరుడు చెప్పాడు కాబట్టి వారిని సేవించు, భగవంతుడు ముఖంలోంచి వచ్చినమాట శాస్త్రం, అందుచేత శాస్త్ర అధ్యయనం విషయంలో అశ్రద్ధ పనికిరాదు. సజ్జన సహవాసం విషయంలో అశ్రద్ధ పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు, సోమరి తనం పనికిరాదు. ఈ విషయాలు అన్నింటిలో మెలకువగా ఉంటే ఇవన్నీ అంతర్ముఖంగా ప్రయాణం చేయటానికి నీకు సహకరిస్తాయి. మనం ఎక్కువగా నేను, నేను అంటున్నాము. ఇది దేహగతమైన నేను. ఈ నేను చుట్టూ తిరిగేవాడు ప్రతీవాడు మూర్ఖుడే. వాడికి చివరికి మిగిలేది జ్ఞానము కాదు మూర్ఖత్వం మిగులుతుంది. జీవలక్షణాలు అతిక్రమించకుండ, ప్రకృతి లక్షణాలు అతిక్రమించకుండ ఎవరూ చైతన్యంలో ఐక్యం కాలేరు. నీ జీవలక్షణాలు పోగొట్టటమే నా పని అంటున్నాడు అరుణాచలేశ్వరుడు. సముద్రం చైతన్యం అందులో ఉన్న చిన్న బుడగ జీవుడు. ఆ బుడగ పగిలిపోతే సముద్రం అవుతుంది. ఆ బుడగ బుడగగా ఉంటే సముద్రం అవ్వదు. ఆ బుడగని అంటే జీవుడిని చైతన్య సాగరంలో కలిపేసుకున్నాడు అరుణాచలేశ్వరుడు. అప్పుడు అంతా చైతన్యమే. నిజమైన నేనుకి హద్దులు లేవు, మిథ్యానేనుకి హద్దులు ఉన్నాయి. మీరు అందరూ నా లోపల ఉన్నారు, నేను మీ లోపల లేను అన్నాడు పరమాత్మ. అంటే మీ జీవలక్షణాలలో, మీ ఇష్టాయిష్టాలలో, మీ పరిమితులలో నేను లేను అని చెప్తున్నాడు. ఈనాటికి అయినా, ముందునాటికి అయినా మీరు అందరూ నాలో ఐక్యం కావలసిందే. వర్షపునీరు ఎక్కడ నుంచి ఎక్కడ నుంచో ప్రవహించి చివరకు సముద్రంలో కలవవలసిందే. అలాగే ప్రారబ్ధవశాత్తు మీరు ఎన్ని జన్మలెత్తినా చివరకు హృదయగుహలోనికి చేరుకోవలసిందే. మన శరీరం ఎంత నిజమో మన ఇల్లు కూడా అంతే నిజం. మన నిజమైన ఇల్లు మన హృదయం.

ప్రతీమనిషికి ఆనందం కావాలి. నాకు ఆనందం వద్దని ఎవరూ చెప్పరు. ఆనందం ఎక్కడ ఉంది? అక్కడకు ఎలా వెళ్ళాలి అని ఎవరూ తెలుసుకోవటం లేదు. ప్రపంచంలో ఏ వస్తువులో ఆనందం లేదు. ఆనందం అనేది నీ ఆధ్యాత్మిక హృదయంలో ఉంది. ఆధ్యాత్మిక హృదయం ఎక్కడ ఉంది అంటే నీకు నేను అనే తలంపు ఉంది. ఆ నేను అనే తలంపు బయటనుంచి రావటం లేదు నీ లోపలనుంచే వస్తోంది. ఆ నేను అనే తలంపు మూలమే ఆధ్యాత్మిక హృదయం. అక్కడే చైతన్యం ఉంది, అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు. అక్కడకు చేరితే నువ్వు ఆనంద సముద్రంలో ఊగిసలాడతావు. అప్పుడు నీ మనస్సు, ఇంద్రియాలు కదలమంటే కదలవు. విషయాలకంటే విషమే మెరుగు అన్నారు ఆచార్యులవారు. ఎందుచేతనంటే విషం పేరు వింటే ఎవరూ చనిపోరు. విషం నోట్లో పోసుకుంటే చచ్చిపోతారు. దానివలన ఆ

శరీరం పోతుంది అంతే. కాని విషయాలను నోట్లో వేసుకోనక్కరలేదు. విషయాలను స్మరిస్తే చాలు అవి అనేక నీచజన్మలకు కారణం అవుతాయి. విషయచింతన వల్ల మనకి విషయాలమీద కోరిక కలుగుతుంది. ఆ కోరిక తీరకపోతే కోపం వస్తుంది. కోపం వస్తే వివేకం కోల్పోతాము. వివేకం కోల్పోతే బుద్ధిపాడైపోతుంది. నీ బుద్ధి పాడైపోయిన తరువాత నీకు ఎన్ని ఉన్నా ప్రయోజనం ఏమిటి? మనం చైతన్యం దగ్గరకు వెళ్ళటానికి మన బుద్ధి మనకి సహకరించాలి. ఆ బుద్ధిని వివేకవంతం చేయాలి. బుద్ధిని సూక్ష్మం చెయ్యాలి. నీ బుద్ధిని బాగు చేసుకోవటం కంటే మించిన పని అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు. మీరు లోకంలో ఏదైనా మంచి చెయ్యండి, మంచి మాట్లాడండి, మీరు సమాజానికి ఎంతోకొంత ఈగోలెస్‌గా ఉపయోగపడండి వీటి అన్నింటి ప్రయోజనం బుద్ధిని బాగుచేసుకోవటానికే. నీ ఇంపెర్సనల్ బిహేవియర్ వల్ల నీ బుద్ధి బాగుపడుతుంది కాని నీ దేహగతమైన నేను వల్ల నీ బుద్ధి బాగుపడదు. ఓ అరుణాచలేశ్వరుడా నిన్ను పట్టుకున్నాను నీ రూపాన్ని సపోర్టుగా పెట్టుకొని నిన్ను ఎంజాయ్ చేస్తున్నాను నువ్వు ఏమి చేసావంటే నేను వేరుగా ఉండి నిన్ను చూడటానికి వీలు లేకుండా నన్ను నీలో ఐక్యం చేసేసుకొన్నావు, నా కొంప ముంచేసావు. నా వ్యక్తీభావన తీసేసావు. దేవుడు వేరు, నేను వేరు అనే భావనని తినేయటానికే నువ్వు ఇక్కడ అవతరించావు అరుణాచలేశ్వరుడా అన్నారు.

ఈశ్వరుడు ఉన్నాడా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఉన్నవాడు ఆయన ఒక్కడే అన్నారు భగవాన్. అంటే మనం లేము అని అర్థం. మనం ద్వైతభావనలోంచి అద్వైతభావనలోకి రావాలి. నీ ప్రారబ్దంలో ఏది ఉంటే అదే వస్తుంది ప్రతీ దానిని అడగవద్దు అని భగవాన్ చెప్తున్నారు. మనం అడగకపోతే ఈశ్వరుడు ఇవ్వడేమో అనుకుంటాము. కోరికకి శక్తి లేదు. శక్తి ఈశ్వరుడిది. నువ్వు స్వప్నావస్థలోంచి జాగ్రదవస్థలోకి రాగానే ఆ స్వప్నావస్థ నీకు అసత్యం అని తెలుస్తుంది. అలాగే నీ హృదయంలో సద్వస్తువు ఉంది ఆ స్వదస్తువులోకి ఎవరైతే మేల్కొన్నారో ఆ మేల్కొన్నవాడికి ఈ జాగ్రదవస్థ కూడా అసత్యం అని తెలుస్తుంది. నీ దేహానికి అతీతంగా, నీ మనస్సుకి అతీతంగా, లోకానికి అతీతంగా నీ హృదయంలో ఒక సద్వస్తువు ఉంది అది మనకి తెలియటంలేదు. దానిని తెలుసుకోవటమే జీవితగమ్యం. ఆ సద్వస్తువును తప్పించి నువ్వు ఏది సాధించినా అన్నీ మనోకల్పితములు. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ నీకు శాంతిలేదు, సుఖంలేదు, ఫ్రీడమ్ లేదు. మనందరికి ఉండాలని ఉంది చనిపోవాలని లేదు. ఆ ఉండటమే దేవుడు. దేహం లేకపోయినా, మనస్సె లేకపోయినా, లోకం లేకపోయినా, దేవతలు లేకపోయినా వీటితో సంబంధం లేకుండా నువ్వు

ఉన్నావు. ఆ ఉండటమే దేవుడు. ఆ ఉండటమనేది నీ హృదయంలో ఉంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నీ జీవితగమ్యం. మిగతావి నువ్వు ఎన్ని సాధించినా స్వప్న సమానం. మనం కోరి తెచ్చుకున్నవన్నీ మనలను బంధిస్తాయి. మనం కాళ్ళు బాడి చేసుకోవటం మళ్ళీ కడుక్కోవటం మనకి ఇంకో పని లేదు. మనకి ఒక కోరిక నెరవేరితే ఇంకొక కోరిక వచ్చేస్తుంది. మనకి ఏది మంచిదో, మనకి ఏది శ్రేయస్కరమో, మనకి ఏది జ్ఞానాన్ని ప్రసాదిస్తుందో మనకంటే ఈశ్వరుడికి బాగా తెలుసు. కాబట్టి నువ్వు ఇంక అడగటం ఎందుకు? మనం తెలివైనవాళ్ళము అని అనుకుంటాము. నాలుగు మొట్టికాయలు తగిలేవరకూ అలా అనుకుంటాము. మనకంటే దేవుడు వివేకవంతుడు, మనం భగవంతుడిని ఏదైనా అడిగితే ఇచ్చాను అంటాడు. మళ్ళీ అందులోంచి విడుదల పొందటానికి సాధన చేయాలి. మనం ఏదైతే లేదో అది కోరుకుంటాము అది వచ్చాక తెలుస్తుంది అందులో ఏమీ లేదని. మనలో బలహీనతలు ఉన్నంతసేపు మనస్సు బాహ్యముఖానికి వెళ్ళటం తప్పదు. నీ మనస్సు చలిస్తూ ఉందంటే నీకు లోపల ఏదో వాసన ఉంది.

ఓ అరుణాచలేశ్వరుడా! నిన్ను అనుభవంలోనికి తెచ్చుకోవటానికి నాలో ఏదైనా చెడ్డ ఉంటే ఆ చెడ్డ నువ్వు కోసేసి నన్ను అక్కడ వదిలేయకు, కళ్యాణగుణాలతో నింపు. మంచిగుణాలు, చెడ్డగుణాలు కూడా మనస్సే కాని నిన్ను తెలుసుకోవటానికి ఆ కళ్యాణగుణాలు ఉపయోగపడతాయి. నిన్ను తెలుసుకున్నాక ఆ కళ్యాణ గుణాలు కూడా పక్కకు తప్పుకుంటాయి. ఓ అరుణాచలేశ్వరుడా నువ్వు నాకు గురువుగా ఉండు. ఆనందం ఎక్కడైతే లేదో అక్కడ భక్తులుచేత వెతికించటం, అన్వేషణ చేయించటం అది గురువు చేసే పని కాదు రాక్షసుడు చేసేపని. ఎక్కడైతే శాంతి స్థానము ఉందో, ఆనంద స్థానము ఉందో అక్కడకు నీ మనస్సును, నీ ఇంద్రియాలను మళ్ళించేవాడే గురువు. నీకు రైట్ డైరెక్షన్ చూపించేవాడే గురువు, మనకి మంచి బుద్ధిని ప్రసాదించేవాడే గురువు. జిడ్డు కృష్ణమూర్తిగారు గురువు అవసరంలేదని చెప్తున్నారు అని ఒకరు వచ్చి భగవాన్‌తో చెప్తారు. ఆయనకు గురువు అవసరం లేకపోవచ్చు ఇతరులకి ఎవరికి గురువు అవసరంలేదని ఆయనకు ఎలా తెలుసు అన్నారు భగవాన్. ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వు పైకి రాళ్ళగుట్టకింద కనిపిస్తున్నావు, కొండలా కనిపిస్తున్నావు కాని నువ్వు జ్ఞానసముద్రుడవు, కృపాసముద్రుడవు, దయాసముద్రుడవు. మన దగ్గర నుంచి ఏమీ ఆశించకుండా హృదయగుహలోకి పంపించే గురువు ఆయన. గురువు ఏ స్థాయిలో ఉన్నాడో భక్తులు కూడా ఆ స్థాయిలోకి వెళ్ళేవరకూ వారిని విడిచిపెట్టడు. బోయవాడు జంతువును ఎలా వెంటాడుతూ ఉంటాడో అలాగ మీ శరీరం చనిపోయి ఇంకో జన్మలోకి

వెళ్ళినా సరే మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. వాడు గురువు. ఆచార్యులవారికి పద్మపాదుడికి కాశీలో మణికర్ణికాఘాట్‌లో వారిద్దరికి స్నేహం కలిసింది ఆ స్నేహం చనిపోయేవరకు అలాగే ఉంది. అది మైత్రి. వారిది జన్మాంతర అనుబంధం. కృష్ణుడు లాస్ట్ మినిట్‌లో అయినా దుర్యోధనుడితో స్నేహం వదిలెయ్యమని కర్ణుడికి చెప్తాడు. నువ్వు చెప్పినట్లు దుర్యోధనుడు మంచివాడు కాకపోవచ్చు అయినా నాకు రాజ్యము లేనపుడు రాజ్యము ఇచ్చాడు, నాకు సింహాసనం ఇచ్చాడు, నన్ను ఆయనతో సమానంగా కూర్చోబెట్టు కునేవాడు. ఈ క్లిష్ట సమయంలో విడిచిపెట్టిరావటం ఇది స్నేహ ధర్మమా! నా తల తీసేసినా స్నేహం విడిచిపెట్టను అన్నాడు. వాడు కర్ణుడు. అది మైత్రి. భగవాన్ అరుణాచలం వచ్చి తనను తాను అరుణాచలేశ్వరుడికి అర్పించుకున్నాక ఇంక ఆయనకి ఎప్పుడూ వేవరింగ్ రాలేదు. అరుణాచలం విడిచిపెట్టి కాశీ చూచివద్దాము, రామేశ్వరం చూచివద్దాము అనే తలంపు కూడా ఎప్పుడూ రాలేదు. అది జన్మాంతర అనుబంధం. అరుణాచలాన్ని స్మరిస్తూ ఉంటే ఆయన నీ దేహాన్ని చంపడు, ఈ దేహం నాది అనే తలంపుని చంపేస్తాడు. ఇది చంపక చంపెడు మందు. మీరు అరుణాచలం సరదాగా వచ్చిన ఆయన చెయ్యవలసిన పని ఆయన చేసేస్తాడు. ఈ అరుణాచలాన్ని దర్శించిన వాడు ఒట్టి చేతులతో వెళ్ళడు. నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు, ఆస్తికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు. మీ తలంపుతో సంబంధం లేకుండా అరుణాచలేశ్వరుడు రహస్యంగా చేసుకువెళ్ళిపోతూ ఉంటాడు. ఆయన స్వభావం అది. అరుణాచలేశ్వరుడు ఆనందం ఇస్తాడు అని నేను ఇతరులకు చెప్పటం కూడా నీకు ఇష్టం ఉండదు. అయినా నేను చెబుతున్నాను నీకు ఇష్టం లేని పని నేను చేస్తున్నాను కాబట్టి నన్ను క్షమించు అరుణాచలేశ్వరుడా అంటారు భగవాన్.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-12-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకుంటూ మిగతా టైములో సాధన చేసుకోండి. మనం పొందవలసిన స్థితి ఏదో శరీరం జీవించి ఉండగానే పొందాలి. మనం భగవదనుభవం పొందాలి. మనం మరణానంతరం వెడితే మంచి లోకాలకు వెడతాము లేకపోతే చెడ్డలోకాలకి వెడతాము కాని సాధనలోకాలకి వెళ్ళము. ఈ భూమి మీదే మనం సాధన చేసుకోవాలి. అందుచేత మీరు కాలాన్ని వృధా చేసుకోవద్దు. మనకు అన్ని అవకాశాలు ఉన్నా, బీదవారు ఎలా బతుకుతున్నారో అలా మనం బతుకుతూ ఉంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. బీదవాడు బట్టలలో నిరాడంబరంగా ఉంటాడు. వాడు అన్నం ఏదో సరిపడ తింటాడు

అంతకంటే ఉండదు. మీరు ఎంత ధనవంతులైనా బీదవాళ్ళు ఎలా బతుకుతున్నారో అలా మనం బతకటం నేర్చుకుంటే మనకి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తుంది. వారే మనకి గురువులు. అందుచేత సాధనలో బహుమెలుకువగా ఉండాలి. ఎవరినీ ద్వేషించకుండా, ఏదీ కాంక్షించకుండా ఉంటే వాడు నిత్యసన్యాసి అని పరమాత్మ చెప్పాడు. మనకి లేనిది ఇతరులకు ఉంటే వారిమీద మనకు ద్వేషం వస్తుంది. ద్వేషం ఎక్కడ నుంచి వస్తుంది అంటే కోరికలోంచి వస్తుంది. కోరికలోంచి కోపం వస్తుంది. కోరికపైకి మనకి మిత్రుడిలాగ కనిపిస్తాడు కాని శత్రువు చేసేపని చేస్తాడు. కోరిక మనకి ఉపకారం చేసినట్టే ఉంటుంది కానీ అది అపకారం చేసేస్తుంది. అందుచేత ఆధ్యాత్మిక మార్గంలో వారు అలా ఉంటున్నారు, వీరు ఇలా ఉంటున్నారు అని అనుకరణ ఉండకూడదు. మనం సాధన చేసి అన్ని విషయాలను నియమించుకోవాలి. అన్ని పరిస్థితులలో కూడా నిగ్రహంగా ఉండాలి. మీకు ధనం ఉన్నా, విద్య ఉన్నా వాటిని నిగ్రహంలో పెట్టుకోవాలి. నిగ్రహంగా లేకపోతే ఆగ్రహం వస్తుంది. మీకు నిగ్రహం లేదు అనుకోండి మిమ్మల్ని ఇతరులు పాడుచెయ్యనక్కరలేదు మీ పాండిత్యము, మీ ఐశ్వర్యము మిమ్మల్ని పాడుచేసేస్తుంది. అందుచేత ప్రాపంచిక మనుషులతోటి అనుకరణ పనికిరాదు. మనం శాస్త్రాన్ని ఆధారంగా పెట్టుకోవాలి. భగవంతుడు చెప్పినట్లు నడుచుకోవాలి.

మన సాధన యొక్క లక్ష్యం ఏమిటి అంటే దేహాభిమానంలోంచి బయటకు రావాలి. మన మాట, చేత, ఆలోచనలకు భగవంతుడే కేంద్రంగా ఉండాలి. అలాగైతేనే వ్యక్తిభావన నశిస్తుంది. గాఢనిద్రలో వ్యక్తిభావన లేదు ఎందుచేతనంటే అక్కడ మనస్సులేదు, ఇంద్రియాలులేవు, దేహం గొడవలేదు. గాఢనిద్రలో వ్యక్తిభావన లేకుండా ఎలా ఉండగలిగామో అలాగే జాగ్రదవస్థలో వ్యక్తిభావన లేకుండా మీరు ఉండగలిగితే మీ శరీరం చనిపోనక్కరలేదు. ఇప్పుడే మీ హృదయంలో ఉన్న ఆనందసముద్రం పొంగి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పుడు మనం ఆనందం కోసం, శాంతికోసం, సుఖంకోసం ఒక పదార్థం మీదకాని, ఒక మనిషిమీదకాని ఆధారపడనక్కరలేదు. మీరు సాధన చేసి, సాధన చేసి మీ హృదయంలో ఉన్న ఆనంద సముద్రంలో మునిగితే మీరు అనేకమందికి ఆనందాన్ని, శాంతిని పంచిపెట్టవచ్చు. అసలు మీకే లేనిది ఇతరులకు ఏమి పంచిపెడతారు. రమణ మహర్షిగారిలో, రామకృష్ణపరమహంస గారిలో ఏదో ఉంది. మనలో అది లేదు అనుకోకండి. మనలో ఏది ఉందో వారిలోనూ అదే ఉంది. మనకీ వారికీ తేడా ఏమిటి అంటే వారిలో ఉన్నది వారు తెలుసుకున్నారు. మనలో ఉన్నది మనకు తెలియటంలేదు. అందుచేత మీరు ఈశ్వరుడిపట్ల గౌరవంగా ఉండి, ఈశ్వరుడి పట్ల ఆరాధన కలిగి, ఈశ్వరుడు చెప్పినమాటలను మననం

చేసుకుంటూ ఉంటే మీ కళ్ళకు కనబడకుండా మీ చెవులకు వినబడకుండా మీకు గొప్ప ఉపకారం చేస్తాడు ఈశ్వరుడు. మీతోటి మాట్లాడాలి అంటే ఆయనకి నోరు అక్కరలేదు మంచి ఆలోచనను మీ హృదయంలోనే స్ఫురింపచేస్తాడు. ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు. నేను, జ్ఞాని ఒక్కటి అంటే ఒక్కటే అని పరమాత్మ చెపుతాడు. ఇద్దరికీ భేదం చూడనక్కరలేదు. పరమాత్మ మన హృదయంలో ఆత్మగా ఉన్నాడు. అది ఎప్పుడు అయితే నీకు అనుభవంలోనికి వచ్చిందో అప్పడు ఈశ్వర స్వరూపాన్ని పొందుతారు. అప్పడు ఈశ్వరుడు కంటే మనం భిన్నం అనే భావన పోతుంది.

జ్ఞానికి ఈశ్వరసంకల్పమే తన సంకల్పం, ఈశ్వరుని ఇష్టమే తన ఇష్టం అందుచేత జ్ఞానికి దుఃఖం ఉండదు. మన సంకల్పం ఒకటి అయ్యుండి ఈశ్వరసంకల్పం ఇంకొకటి అయితే మనకి దుఃఖం వస్తుంది. అసలు మనం పాడైపోవటానికి కారణం ఇష్టాఅయిష్టాలు. మనకి ఇష్టం ఉన్నా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది, అయిష్టం ఉన్నా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. మనకి ఇష్టాలు, అయిష్టాలు లేకపోతే మనస్సు ఇంక బాహ్యముఖానికి వెళ్ళదు. నువ్వు వేరు, నేను వేరు అనే భేదబుద్ధి తగ్గించుకుంటూ ఉంటే మనస్సు పలచబడిపోతుంది. మన మనస్సును మనం బాగుచేసుకోవటం కంటే మించిన పని లేదు, మనస్సును బాగుచేసుకోవటం కంటే మించిన సాధన లేదు. మీ మనస్సు మీకు అదుపులో ఉంటే మీ బంధువులు, మీ స్నేహితులు, మీ డబ్బు ఇవ్వలేని శాంతి, సుఖము మీ మనస్సే మీకు ప్రసాదిస్తుంది. నీ మనస్సుని నువ్వు ఎప్పడూ విరోధిగా పెట్టుకోవద్దు, స్నేహితుడిగా మార్చుకో. నువ్వు చేయవలసిన సాధన అదే. శరీరం చనిపోయిన తరువాత మన కూడా ప్రయాణం చేసేది మనస్సే. అందుచేత మనస్సుకి ట్రైనింగు ఇచ్చి శరీరం ఉండగానే దాని మూలమైన హృదయంలో ఐక్యం చేయగలిగితే మనస్సు ఇంక ప్రయాణం చేయదు. ఎప్పడు అయితే మనస్సుకి ప్రయాణం ఆగిపోయిందో ఇంక పునర్జన్మ లేదు. రాగద్వేషాలలోంచి ఎవరి మనస్సు అయితే పూర్తిగా విడుదల పొందిందో వారు మాత్రమే సంసారాన్ని జయించగలరు. భూమి మీద మెరకాపల్లాలు ఎలా ఉంటాయో అలాగే నీ మనస్సులో హెచ్చుతగ్గులు కనుక ఉంటే సంసారాన్ని జయించలేవు. సంసారం అంటే నీ ఇంట్లో ఉన్న మనుషులు కాదు. నీ మనస్సే సంసారము. బ్రహ్మము నిరాకారము, నిర్గుణము. అది అంతటా వ్యాపించి ఉంది. అదే మన హృదయంలో కూడా ఉంది. అందుచేత నీ హృదయంలో ఉన్న ఆ మూలపదార్థాన్ని నువ్వు తెలుసుకొంటే ప్రపంచం అంతా వ్యాపించి ఉన్న వస్తువు నీ హృదయంలో ఉన్న వస్తువు ఒక్కటే అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఇప్పడు మనం శరీరంలో నిలబడి ఉన్నాము, మనస్సులో నిలబడి ఉన్నాము. ఇంద్రియాలలో నిలబడి ఉన్నాము, ఇష్టంలో నిలబడి ఉన్నాము, అయిష్టంలో

నిలబడి ఉన్నాము. అలా కాకుండా అంతటా వ్యాపించి ఉన్న బ్రహ్మములో నువ్వు నిలబడి ఉంటే, అక్కడ స్థిరంగా ఉండగలిగితే అప్పడు నిన్ను సంసారం విడిచిపెట్టేస్తుంది. అప్పటివరకు సంసారం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. చనిపోతే సంసారం పోతుంది అనుకోకండి చనిపోతే శరీరాలు మారతాయి కాని సంసారం వచ్చేస్తుంది. నువ్వు చనిపోతే శరీరంలోంచి బయటకు రాగలవు కాని మనస్సులోంచి ఎలా బయటకు వస్తావు. అది నిన్ను వెంటాడుతుంది. నీ మనస్సులో ఎన్ని దోషాలు ఉన్నాయో ఆ దోషాల్లోంచి నువ్వు విడుదల పొందేవరకు ఏ దోషము నిన్ను విడిచిపెట్టదు. మీ మనస్సులో ఏదైనా దోషం ఉందనుకోండి అది ఇతరులకు తెలియకపోవచ్చు కాని నీకు తెలుస్తూ ఉంటుంది. నీ మనస్సులో ఉన్న దోషంలోంచి నువ్వు విడుదల పొందాలి అదే సాధన. బ్రహ్మము ఎంత నిర్దోషముగా ఉందో నీ మనస్సుకూడా అంత నిర్దోషముగా ఉంటేనే బ్రహ్మాకారం చెందుతుంది. అప్పడు నిన్ను సంసారం విడిచిపెడుతుంది.

మన ముఖం అద్దంలో చూచుకున్నప్పడు మన ముఖంలో ఎక్కడైనా మసి కనబడితే ఆ మసిని మనం తుడిచేసుకుంటాము. అలాగే శాస్త్రం అద్దం లాంటిది. మన మనస్సులో దోషాలు ఏమిటో భగవంతుడు చెబుతూ ఉంటాడు. ఆ దోషాలు ఉన్నాయో లేదో శాస్త్రం చూపిస్తూ ఉంటుంది. శాస్త్రం ఆ దోషాన్ని తీయదు, మనం సాధన చేసి గురువు అనుగ్రహం సంపాదించి, ఈశ్వరానుగ్రహం సంపాదించి ఆ దోషాన్ని మనమే తొలగించుకోవాలి. దోషం ఎంత బరువుగా ఉందో అంత సాధన చేస్తేకాని అందులోంచి విడుదల పొందలేము. కర్తురాజ్ఞయా అంటే అక్కడ ఈశ్వరుని ఆజ్ఞ అనుసరించి మీకు ఫలితం వస్తుంది. మీ తెలివి తేటలవల్ల ఫలితం రావటంలేదు. ప్రతీ జీవుడికి ఒకో ప్రారబ్దం ఉంటుంది. ఈశ్వరుడు ఆ ప్రారబ్దాన్ని అనుసరించి ఫలితాన్ని ఇస్తాడు. అది మన ప్రారబ్దమే అని తెలియక ఈశ్వరుడు చేసాడు అనుకుంటాము. ఈశ్వరుడు కాదు మన ప్రారబ్దమే దానికి కారణం అని అర్థం చేసుకొంటే మనం ఈశ్వరుడిమీద నిందలు వేయటం మానేస్తాము. ప్రారబ్దం అనుభవించేటప్పడు అది నీకు ఇష్టం లేకపోయినా ఇష్టంగా కనుక దానిని అనుభవిస్తే రాబోయే జన్మలలో ఆ ప్రారబ్దం నీకు ఎదురవ్వదు. ప్రారబ్దంలో ఉన్నది మీకు కేటాయిస్తాడు. అంతేకాని లేనిది మీకు కేటాయించడు. ఉన్నది తీసేయడు, లేనిది కలపడు. బ్రహ్మము ఎంత నిర్దోషముగా ఉందో అలాగ నీ మనస్సు నిర్దోషముగా లేకపోతే శాస్త్రాన్ని పరిశీలించుకొని ఆ దోషాలు ఏమిటో జాగ్రత్తగా చూచుకొని ఒకో దోషంలోంచి, ఒకో దోషంలోంచి విడుదల పొందటమే సాధన. మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, క్షేత్రాలని దర్శించండి ఎన్ని చేసినా ఆ దోషంలోంచి బయటకు రావటమే సాధన యొక్క ప్రయోజనం.

తపస్సు అంటే ఎండింపజేయటం. మీ మనస్సుని ఎండింపచేయగా, ఎండింపచేయగా అప్పడు మీ మనస్సులో ఉన్న దోషాలు పోతాయి. అప్పడు మనస్సు నిర్దోషం అయి, నీ మనస్సు వెళ్ళి బ్రహ్మములో నిలబడుతుంది. మీరు ఎంత సాధన చేస్తూ ఉన్నా మీకు ఆహారనియమం లేకపోతే మొత్తం సాధన అంతా పాడైపోతుంది. మీరు తిండి దగ్గర బహుజాగ్రత్తగా ఉంటే మీ మనస్సు మీకు స్వాధీనంలోకి వస్తుంది. మనం అన్ని ఇంద్రియాలని కంట్రోలులోకి తెచ్చుకోవాలి. కొన్ని ఇంద్రియాలను నియమించుకుని కొన్ని ఇంద్రియాలను వదిలేసినా సాధన నిలబడదు. చెడ్డ విషయాలు వింటే, చెడ్డ విషయాలు చూస్తూ ఉంటే చెడ్డ ఆలోచనలు రాకుండా మనం ఆపుచేయలేము. అందుచేత చూచే దృశ్యాల విషయంలో, చెవులతోటి వినే విషయాలలో బహుజాగ్రత్తగా ఉండాలి.

బయట పరిస్థితులు మనకు అనుకూలంగా ఉంటే మనకి తప్పనిసరిగా పొంగువస్తుంది. నువ్వు ఎందుకు పొంగిపోతున్నావో దేవుడికి సమాధానం చెప్పాలి. మన పరిస్థితులు బాగాలేవు అనుకోండి దుఃఖం వచ్చేస్తుంది. నువ్వు ఎందుకు దుఃఖపడుతున్నావో దేవుడికి సమాధానం చెప్పాలి. దీనినిబట్టి సాధనచేయటం ఎంత కష్టమో చూడండి. మీరు ఏదివచ్చినా అందులో కలవకండి మీ అబ్బాయి మంచివాడు అయితే వాడిని అలాగ ఉండనివ్వండి. మీ అబ్బాయి మంచివాడు అని మనస్సులో సంతోషం పీల్చుకోకండి. మీరు పీల్చుకుంటే మళ్ళీ ఎప్పటికైనా ఆ సంతోషం దుఃఖంకింద మారిపోతుంది. మీ అబ్బాయి చెడ్డవాడు అనుకోండి మా అబ్బాయి చెడ్డవాడు, చెడ్డవాడు అని మీరు మొయ్యవద్దు. మీరు మోస్తే దుఃఖం ప్రారంభమవుతుంది, మంచివాళ్ళని మోస్తే సంతోషం ప్రారంభమవుతుంది. ఈ రెండింటికి ఏదో జన్మలో మీరు భగవంతుడికి సమాధానం చెప్పకోవలసిందే. ధర్మము అంటే కేవలము దానము అని కాదు. మీకు పది రూపాయలు ఉంటే ఎవరికైనా సహాయం చేస్తే పుణ్యం వస్తుంది కాని బ్రహ్మజ్ఞానం రాదు. ధర్మము అంటే ఒక జీవిత విధానం. నువ్వు ఎలా జీవిస్తే భగవంతుడిలో ఐక్యమవుతావో అలా జీవించటం నేర్చుకోవటమే ధర్మము. మీరు ఎవరికి సహాయం చెయ్యకపోతే పాపం రావచ్చు. పాపం వస్తే దుఃఖము వస్తుంది. దీనికి బ్రహ్మజ్ఞానానికి సంబంధం లేదు. పాపం వస్తే దుఃఖంగా కరిగిపోతుంది, పుణ్యం వస్తే సుఖంగా కరిగిపోతుంది. మీరు ఎవరికైనా పదిరూపాయలు పెట్టారనుకోండి, వాడు ఎప్పడైనా మీరు నాకేమి పెట్టలేదు అంటే అప్పడు మీకు కోపం వస్తుంది. కోపం ఎందుకు వస్తుంది, నేను పెట్టాను అనే భావన మీకు ఉంది కాబట్టి అలా ఉంటే ఇంక మీ మనస్సు బాగుపడదు. మీరు పతనమైనట్టే. మాకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మా డ్యూటీ చెయ్యాలికదా అని డ్యూటీ చేస్తున్నాం అని చాలామంది అంటారు. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చెయ్యి అది ధర్మం. ధర్మాన్ని ఆచరించేవాడు డ్యూటీ ప్రేమగా చేస్తాడు. నువ్వు చేసేది ప్రేమగా చేస్తే మనస్సు, ఇంద్రియాలు బ్రహ్మమువైపుకి ఉపసంహరించుకుంటాయి. ఇంద్రియాలు

వెళ్ళి మనస్సులో ఐక్యమవుతాయి, మనస్సు వెళ్ళి బ్రహ్మములో ఐక్యమవుతుంది. అలా జీవించే విధానం నేర్చుకోవటమే ధర్మము.

దైవములో నీ మనస్సుని నిలబెట్టి ఉంచాలి. దైవములో నీ మనస్సుని నిలబెట్టి ఉంచలేకపోతే నీ మనస్సు అన్యవిషయాలని చింతిస్తూ ఉంటుంది. మనస్సు ఏ విషయం అయితే చింతిస్తోందో అక్కడికి ముందు మనస్సు వెళ్ళిపోతుంది. వెళ్ళిపోయి అది ఆగదు మన శరీరాన్ని కూడా తీసుకుపోతుంది. మన శరీరాన్ని నరకంలో పెట్టేది మనస్సే, మనకి మోక్షాన్ని కలగజేసేది కూడా మన మనస్సే. సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకూడదు, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోకూడదు అనే మాటలు నువ్వు వినవచ్చు. విన్నా నువ్వు అలా ఉండలేవు. ఆత్మచింతన తప్ప ఇతర చింతన లేకుండా నీ మనస్సు ఉన్నప్పుడు మాత్రమే నువ్వు పొంగిపోకుండా, కుంగిపోకుండా ఉండగలవు. అది మనకి అనుభవంలో తెలుస్తూ ఉంటుంది. నువ్వు ఆత్మసుఖాన్ని పొందితే, ఆత్మశాంతిని కనుక పొందితే బాహ్యవిషయాలలోకి నీ మనస్సు వెళ్ళదు. బాహ్య విషయాలు అన్నీ స్పర్శ సుఖాలు. హృదయంలో ఉన్న ఆత్మసుఖం మనకి అనుభవంలో ఉన్నప్పుడు స్పర్శసుఖాలు అన్నీ ఎదురుగుండా ఉన్నప్పటికీ మనస్సు వెళ్ళి అందులో చిక్కుకోదు, అందులో బంధింపబడదు. ఇక్కడ ఆత్మసుఖం లేదు అనుకోండి, శాంతి లేదు అనుకోండి తప్పనిసరిగా బాహ్యవిషయాలలోకి వెళ్ళి బంధింపబడుతుంది. భగవాన్ అరుణాచలేశ్వరుడితో ఏమన్నారు అంటే నేను ఎప్పుడూ నారాయణస్మరణగాని, శివస్మరణగాని చేయలేదే, పూజలేదు, తీర్థయాత్రలు లేవు నేను ఏమీ సాధన చేయలేదు, అరుణాచలం అన్నాను అంతే నా నేనుని తీసేసుకుని నీ నేనుని నాకు ప్రసాదించావు. నీలో ఐక్యం చేసేసుకున్నావు. నీవూ నేను అనే బేధబుద్ధి లేకుండా చేసేసావు. నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి ఉన్నంతకాలం అక్కడ మనస్సు ఉందని అర్థం. మనస్సు ఉన్నంతకాలం నీకు సంసారం తప్పదు. ఆ నేనుని నువ్వు తినేటప్పుడు నాకు నొప్పిలేకుండా తీసేసావు. ఏదైతే నేను నేను అనుకుంటున్నానో ఆ నేను నాకు కాకుండా చేసేసావు అరుణాచలేశ్వరుడా. నా జీవలక్షణాలన్నీ తీసేసావు అరుణాచలేశ్వరుడా అన్నారు. నీ ప్రారబ్దం మంచిది అయినా, నీ ప్రారబ్దం చెడ్డది అయినా నీకేమీ సంబంధం లేదు. ప్రారబ్దం నువ్వు కాదు కదా అన్నారు భగవాన్. మీకు నూటికి నూరుపాళ్ళు చెడ్డ ప్రారబ్దం ఉంది అనుకోండి మీ శరీరం మీరు కాదని మీకు అర్థం అయ్యింది అనుకోండి ఆ ప్రారబ్దం మిమ్మల్ని ఏమీ ముట్టుకోదు అని చెప్పారు. ప్రారబ్దం దేహానికే లోపల చైతన్యానికి ఏమీ లేదు. పుట్టిన దానికి ప్రారబ్దం ఉంటుంది కాని పుట్టనిదానికి ప్రారబ్దం ఉండదు. తుకారామ్ చాలా కష్టాలు పడ్డాడు. మనకి కష్టాలు వస్తే ఈ కష్టాలు ఎప్పుడూ పోతాయి అని అనుకుంటాము కాని తుకారామ్ ఓ పాండురంగా నువ్వు నాకు కష్టాలు పంపుతున్నావు ఆ కష్టం

కష్టంగా ఉండటంలేదు. నాకు ఎన్ని కష్టాలు ఉన్నాయో అన్నీ పంపేసావు. అదనంగా నీవు ఏవైనా కష్టాలు పంపుదామన్నా నీ దగ్గర ఇంక ఏమీలేవు. ఓ పాండురంగా నా చేతిలో నువ్వే ఓడిపోయావు అన్నాడు. తుకారామ్ ప్రారబ్ధాన్ని ఇష్టంతోటి అనుభవించాడు. నా లోపల ఏదో నేను ఉంది అంటున్నారు. ఆ నేనును పోగొట్టుకోవాలని ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. అది తీసుకువచ్చే అరిష్టాలు కూడా నాకు తెలియదు. పాండురంగడిపట్ల ఉన్న ప్రేమ, ఆప్యాయత, భక్తి, ఇష్టం తప్పించి ఇంకోటి నాకు తెలియదు. పాండురంగడిపట్ల నాకు ఉన్న విశ్వాసంలో, ఆ భక్తి ప్రవాహంలో, ఆ ప్రేమప్రవాహంలో ఈ నేను ఎప్పుడు కొట్టుకుపోయిందో నాకు తెలియదు. కొట్టుకుపోయాక తెలిసింది అన్నాడు వాడు తుకారామ్. వాడికి వైకుంఠం నుండి విమానం వచ్చింది.

సూర్యుడు ముందు కిరసనాయిలు దీపం ఎలా ఉంటుందో మీకు ఆత్మసుఖం అనుభవంలో ఉన్నప్పుడు విషయ సుఖాలు అలా ఉంటాయి. అసలు విషయాలు పట్ల మీకు ఆకర్షణ కలగదు. మీ శరీరంలో ఉన్న ప్రాణం పోయే టైముకి మీరు నూటికి నూరుపాళ్ళు ఆనందంగా, శాంతిగా ఉండగలిగితే మీకు పునర్జన్మ లేదు. ఇది మీరు గుర్తుపెట్టుకోండి. అలా ఉండటం కష్టమే. మన మనస్సు ఇష్టం మీదకో, అయిష్టం మీదకో వెళ్ళిపోతుంది. అది ఆత్మసుఖంలో నిలబడి ఉండదు. విషయస్పర్శతో సంబంధం లేకుండా, మనో దేహములతో సంబంధం లేకుండా, లోకంతో సంబంధం లేకుండా, సంసారంతో సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు శాంతిగా ఉండగలిగితే నీకు పునర్జన్మ లేదు. నీకు జన్మ వస్తుందా లేదా అని శాస్త్రం చదవనక్కరలేదు. ఇది నీకు కొండ గుర్తు. సుఖం వేరు, సంతోషం వేరు. విషయస్పర్శ వల్ల వచ్చేది సంతోషం, ఆత్మలోంచి వచ్చేది సుఖం. సంతోషంలో కలుషితం ఉంటుంది. ఆత్మసుఖంలో కలుషితం ఉండదు. ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పుడే, మీరు సమాజం మధ్యలో ఉన్నప్పుడే కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం నూటికి నూరుపాళ్ళు మీరు తట్టుకోగలిగితే మీ శరీరం రాలిపోవటం, మీరు సుఖసముద్రంలో ఐక్యమైపోవటం ఒకేసారి జరిగిపోతాయి. అప్పుడు మీ మనస్సు ఇంక ప్రయాణం చేయనక్కరలేదు. మీరు ఎంత గొప్ప లోకాలకి వెళ్ళినా మళ్ళీ తిరిగి ఈ భూమి మీదకు వచ్చి సాధన చేసుకోవాలి. అందుచేత కాలాన్ని పాడుచేసుకోకూడదు. ముందు నీ మనస్సులో ఉన్న కల్మషాన్ని, కపటాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి అదే సాధన. కపటికి జ్ఞానం ఏమిటి? నిరంతరము ఈశ్వరుడిని స్మరించటం వలన, నిరంతరము ఈశ్వరుడి దయ సంపాదించే ప్రయత్నంలో ఉండటం వల్ల మనస్సులో ఉన్న కల్మషాలన్నీ పల్చబడిపోతాయి. ఎవడైతే మనస్సులో ఉన్న కల్మషాలని సాధన చేసి, సాధన చేసి కష్టపడి ఆ కల్మషాలను పోగొట్టుకుంటాడో వాడు మాత్రమే బ్రహ్మములో ఐక్యమవుతాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జనవరి | 30 | వాలమర్రు |
| ఫిబ్రవరి | 4 | గీతామందిరం, సఖినేటిపల్లి |
| ఫిబ్రవరి | 12 | చించినాడ (శివరాత్రి) |
| ఫిబ్రవరి | 21 | శివ కళ్యాణ మండపం, భీమవరం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# 2010 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

## భగవాన్ శ్రీ రమణ మహర్షి

గొప్ప మాటలు ఆశయాలు వల్లించడం కన్నా కొద్ది వాటినైనా ఆచరించి చూపడం ముఖ్యం, దానినే ఆచరణ వేదాంతం అంటారు. సకల జీవకోటి శాంతి సౌభాగ్యాల కోసం తమ జీవితాలను పరిపూర్ణంగా అంకితం చేసిన వారే మహాత్ములు. అట్టి మహాత్ములలో ఒకరైన అరుణాచల ఋషి, భగవాన్ రమణ మహర్షి తన పదిహేడవ ఏట అమృతానుభవం ద్వారా జ్ఞాన సింహాసనాన్ని అధిష్టించి తరువాత తన జీవితాంతం జీవన్ముక్తునిగా అరుణాచలంలో సంచరించి సకల సృష్టికి మార్గదర్శిగా నిలిచారు. భగవాన్ నిరాడంబరులు మరియు నిజమైన ఆధునిక సమతావాది. విశ్వశ్రేయస్సే వారి శ్రేయస్సుగా భావించారు. తానున్న అద్వయ స్థితిలోకి జీవకోటిని నడిపించటానికి నిరంతరం పాటుపడిన సహృదయ సంపన్నుడు. మానవుల స్వీయ అభివృద్ధికి ఆటంకం వారి దేహాత్మబుద్ధియే కారణమని బోధించి దానినుండి విడుదల పొందుటకు ఆచరణ మార్గమును సూచించి అందరిని తరింపజేయుటకు జీవితాంతం కృషి చేసారు. ఎవరి మనస్సును వారు సంస్కరించుకోవడం ద్వారా స్వరూప దివ్యత్వంలోకి మేల్కొనగలరని దానికి అందరూ అర్హులేనని బోధించారు. ఏబది సంవత్సరములు జీవన్ముక్తునిగా అరుణాచలంలో సంచరించిన కాలంలో సరళంగా భగవాన్ బోధించిన ఆత్మ విద్య ఖండాంతరములకు ప్రాకినది. వారి బోధను ఆచరణలో పెడితే జన్మధన్యం అవుతుంది.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# సెన్సు పెరిగే కొలది - నాన్‌సెన్సు తగ్గుతుంది

ఏది సత్యమో? ఏది అసత్యమో అని తెలుసుకోగలిగే బుద్ధి సహజంగా అనిత్యమైన దాన్ని విడిచిపెడుతుంది. ప్రకృతిలో ఏ వస్తువులోనూ ఆనందం పొందలేము. సరికదా బాధనే కలిగిస్తుంది అని గ్రహిస్తే వాటికి దూరంగా ఉండగలము. వివేకం పుష్పించి ఫలిస్తే వైరాగ్యమౌతుంది వివేకం ఎంత దృఢంగా ఉంటే వైరాగ్యం అంత సమర్థవంతంగా, అర్థవంతంగా ఆరోగ్యంగా ఉంటుంది. వస్తువుల్లో ఆనందం లేదు అని వస్తువులను మన సంస్కారాలతో చూచే దృష్టిలోనే ఆనందం ఉందని వస్తువులు నిత్యమూ మారుతూ నశిస్తూ ఉంటాయని గుర్తించిన బుద్ధిలో వివేకం ఉదయిస్తుంది. నిత్యానందం మనలోనే ఉందని గ్రహిస్తే నాన్‌సెన్సు విషయాలపట్ల మనం పరుగెత్తము. మనస్సు యుద్ధాన్ని అందిస్తుంది. అమస్కంలో ఏమీ ఉండదు. మనస్సు మనలను స్వంతం చేసుకోవటానికి ప్రయత్నిస్తుంది" మనసా ఎందుకు ఈ మిడిసిపాటు శరీరం బూడిద అవుతుంది. మరలా జనన మరణ చక్రంలో బంధించ బడతావు. నమ్రత, వినయం అలవర్చుకోవాలని పెద్దలు చెబుతారు అని మన మనస్సుకు మనం హితబోధ చేసుకోవాలి. శ్రీనాన్నగారు "మీ మనస్సులో మైనెస్ పాయింట్లను మనస్సే ఎలా పనిచేస్తున్నదో చూచుకోవాలి. ద్వేషం ఉంటే ద్వేషరహిత స్థితిలోకి వెళ్ళలేము. లోపల ఉన్న పాపమే ద్వేషంగా మారుతుంది. దానికి సాధన చెయ్యకపోతే కొన్ని జన్మలు వ్యర్థమౌతాయి" అన్నారు. మనం ఎవరిని దుర్భలులు అని అన్నా అది మన పాపమే. అంతా ఒకే పరమాత్మ నిండియున్నాడు మనం ఉన్నతస్తానంలో ఉన్నా న్యూనత స్తానంలో ఉన్నా రవ్వంత లెక్కచేయకూడదు. మన కాళ్ళమీద మనం నిలబడాలి భయాలు అన్నిటి వెనుక స్వార్థం ఉంటుంది. మనకు రెండు అంశాలు ముఖ్యం ఒకటి శాంతము, రెండు మౌనము. మనం ఇతరులతో పోల్చుకోకపోతే మనం మనంగా ఉండగలము. నిరంతరం మన మనస్సును విచారణ శీలమై ఉంచుకోవాలి. బ్రహ్మమే నేను అని నిశ్చయించుకోవాలి. నీటిలోని నాచు మొక్కలు దట్టంగా ఉంటే వాటిని ప్రక్కకు తొలగిస్తే తక్షణం మరలా నీటిని ఆ మొక్కలు కప్పివేస్తాయి. అలాగే బహిర్ముఖమైన ప్రాజ్ఞుణ్ణి కూడా మాయ వశం చేసుకొంటుంది. పరమేశ్వరుని కరుణ వల్లనే గురువు లభిస్తాడు. తరువాత మన సెన్సును ఆయనే ఉద్ధరించి నిజ గమ్యాన్ని చేరుస్తారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**